నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | డిసెంబర్ 27, 2023 | www.navatelangana.com

వీవోల కార్యవర్గం ఎన్నిక



సమావేశమైన కమిటీ

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని వివోల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏక(గ్రీవంగా రాష్ట్ర సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పఠాన్ గౌస్ ఖాన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ అధ్యక్షురాలుగా లత (పోసానిపేట్), ఉపాధ్యక్షురాలు లక్ష్మీ నరసవ్వ (రెడ్డిపేట్), కోశాధికారిగా లావణ్య (అన్నారం) సహాయ కార్యదర్శిగా సుజాత (రామారెడ్డి), కార్యదర్శిగా స్వప్న (మోషన్ పూర్), కార్యవర్గ సభ్యులుగా అనసూయ (ఉప్పల్వాయి), రాజేశ్వరి (మద్దికుంట), లావణ్య (రామారెడ్డి) తదితరులను ఎన్నుకున్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీపై గ్రామసభ



సమావేశమైన గ్రామస్తులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని జప్తి జాన్కంపల్లి గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చివరకు గ్రామంలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం డిఆర్పి రాజేశ్వర్ గత మూడు రోజుల నుండి గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో అవకతవకలు జరగలేదని గ్రామసభలో వారు పేర్కొన్నారు. గ్రామసభలో సర్పంచ్ సాయిలు, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్, గ్రామపెద్దలు దేవి సింగ్, క్షేత్ర సహాయకులు రాములతో పాటు ఉపాధి హామీ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

అక్రమ మైనింగ్‌ను సహించేది లేదు

- మంత్రి జూపల్లి సీరియస్
- సమగ్ర నివేదిక అందించాలని అధికారులకు ఆదేశం

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ఎలాంటి అనుమతులు లేకుండా ప్రజలకు నష్టం కలిగించే రీతిలో కొనసాగుతున్న అక్రమంగా మైనింగ్ ను ఎంతమాత్రం ఉపేక్షించబోమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ప్రజాపాలన కార్యక్రమం అమలు తీరుపై మంగళవారం నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన సందర్భంగా మంత్రి అక్రమ మైనింగ్ అంశాన్ని ప్రస్తావిస్తూ సీరియస్ అయ్యారు. సమీక్ష కోసం తాను నిజామాబాద్ కు వస్తున్న సందర్భంగా కామారెడ్డిలో పలువురు బాధితులు తనను కలిసి మాచారెడ్డి ఉమ్మడి మండలంలోని మంథని, దేవునిపల్లిలలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ గురించి ఫిర్యాదు చేశారని అన్నారు. భారీ పేలుళ్ల కారణంగా వందలాది బోరు బావులు, నివాస గృహాలు దెబ్బతిన్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు. గత కొన్నాళ్లుగా అక్రమ మైనింగ్, బ్లాస్టింగ్స్ జరుగుతున్న ఎందుకు చర్యలు చేపట్టలేదని సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. తక్షణమే విచారణ జరిపి వారం రోజుల్లో తనకు సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అక్రమ మైనింగ్ కారణంగా నష్టపోయిన బాధితులకు మైనింగ్ యాజమాన్యం ద్వారా నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండలంలో సైతం పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ కొనసాగుతోందని స్థానిక శాసనసభ్యుడు మంత్రి దృష్టికి తేగా, దానిపైనా విచారణ జరిపించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు.

జాతీయ ఉద్యోగ సదస్సుకు ఎంప్లాయిస్ జేఏసీ బృందం



తరలివెళ్తున్న ఉద్యోగులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

అఖిలభారత ఉద్యోగ సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్)ఆధ్వర్యంలో, పశ్చిమ బెంగాల్ రాజధాని కోలకత్తలో నిర్వహిస్తున్న జాతీయ ఉద్యోగ సదస్సుకు నిజామాబాద్ జిల్లా పక్షాన, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు అలుక కిషన్ అధ్యక్షతన టీఎన్జీవో బృందం మంగళవారం బయలుదేరారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు చిట్టి నారాయణ రెడ్డి, కేంద్ర సంఘ కార్యదర్శి పోల శ్రీనివాస్, సలహాదారులు ఆకుల ప్రసాద్, ఉపాధ్యక్షులు వేణుగోపాల్, అధ్యక్షులు దినేష్ బాబు, అర్బన్ కార్యదర్శి జాకీర్ హుస్సేన్, జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవయ్య, ఉమా కిరణ్, విశాల్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలచెంతకు ప్రభుత్వ పాలన

- ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా ఆరు గ్యారంటీలు అమలు
- ప్రజాపాలన నిర్వహణ ప్రణాళిక రూపొందించాలి
- అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ప్రజాపాలనపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి.. హాజరైన జడ్పీ చైర్మన్, ఎంపీ, ఇరు జిల్లాల ఎమ్మెల్యేలు, మేయర్, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

'దశాబ్దాల పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది తమ సమస్యలు పరిష్కారం అవుతాయని, కష్టాలు తీరుతాయని ఎంతో ఆశతో ఉన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వారి సమస్యలను తీర్చి, బడుగు, బలహీన వర్గాల ఆర్థిక ప్రగతికి తోడ్పాటు అందించాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని రూపొందించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం ప్రజా పాలన అనే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్టు' రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేస్తూ, ఆరు గ్యారంటీల అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో దరఖాస్తుల స్వీకరణకై ప్రభుత్వం ఈ నెల 28 నుండి జనవరి 6 వరకు అమలు చేయనున్న ప్రజా పాలన కార్యక్రమంపై నిజామాబాద్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రజాపాలన కార్యక్రమం అమలు తీరుపై ఉభయ జిల్లాల అధికారులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమాన్ని రూపొందించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని నిర్ణయించిందన్నారు.

> ప్రజాపాలన కార్యక్రమంలో తొక్కిసలాటలు, రద్దీ వంటి వాటికి ఆస్కారం లేకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, ముందస్తుగానే అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ కూడా సంపూర్ణ భాగస్వామ్యం అయి, ప్రజా పాలన కార్యక్రమాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సానుకూల దృక్పథంతో, ప్రజలను సంతృప్తిపరిచే రీతిలో ఈ కార్యక్రమం కొనసాగాలన్నారు.

అర్హత కలిగిన ప్రతీ ఒక్కరు మహాలక్ష్మి, రైతు భరోసా, గృహలక్ష్మి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు, అవకతవకలకు తావు లేకుండా ప్రజా పాలన కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సంపూర్ణ సమాచారాన్ని సేకరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, తద్వారా అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతాయని మంత్రి జూపల్లి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, యువత ఇలా అన్ని వర్గాల వారికి మేలు చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ప్రజా పాలన అమలు కోసం చేపట్టిన చర్యల గురించి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, పి.యాదిరెడ్డి, మనూ చౌదరిలు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు కేఆర్.సురేష్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ జెడ్పి చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, నిజామాబాద్ నగర మేయర్ నీతూ కిరణ్, ఉమ్మడి జిల్లా శాసన సభ్యులు పి.సుదర్శన్ రెడ్డి, ఆర్.భూపతి రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, ధన్ పాల్ సూర్యనారాయణ, వెంకట రమణా రెడ్డి, కామారెడ్డి ఎస్పీ సింధు శర్మ, నిజామాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఉభయ జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశానికి హాజరైన ఉమ్మడి జిల్లా అధికారులు

మొక్కుబడిగా వద్దు

అధికారులు ఏదో మొక్కుబడిగా కాకుండా జవాబుదారీతనంతో అత్యంత పారదర్శకంగా క్షేత్రస్థాయిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని మంత్రి హితవు పలికారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరించి, ఆ వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతీ పేదవాడికి తప్పనిసరి న్యాయం జరగాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా అధికారులు అంకితభావంతో పని చేయాలన్నారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి అర్హులైన ఏ ఒక్కరు కూడా తప్పిపోకుండా చూడాలని, ప్రజాపాలన కార్యక్రమం గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలందరికి అవగాహన కల్పించాలని అన్నారు. ఈ ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, అవగాహన కల్పించేలా ప్రజాప్రతినిధులు, మీడియా, సోషల్ మీడియాలో యువత కూడా తమవంతు చొరవ చూపాలన్నారు.

కండక్టర్లపై ఒత్తిడి

- మహిళలకు బస్‌పాస్ జారీ చేస్తే మేలు
- రద్దీలో ఎవరికి ఏ టికెట్ ఇస్తున్నామో తెలియట్లేదని పలువురి ఆవేదన



ఫుట్‌బోర్డుపై సైతం నిలబడి ప్రయాణిస్తున్న పలువురు..

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ఉచిత బస్ ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. పథకం ప్రారంభించిన నాటి నుంచి బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గతంలో కంటే ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. ప్రతి బస్సులో సీట్లల్లో కూర్చోవడంతో పాటు నిలబడి ప్రయాణం చేస్తున్నారు. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా.. కండక్టర్‌లపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. టికెట్ అందరికీ జారీ చేసేందుకు తల ప్రాణం తోకకు వస్తున్న చందంగా మారింది. కొన్ని సందర్భాల్లో ఎవరికి ఏ టికెట్ ఇస్తున్నామో, డబ్బులు ఎంత తీసుకుంటున్నామో తెలియని పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా కామారెడ్డి, బాన్సువాడ డిపోలు ఉన్నాయి వీటి పరిధిలో గతంలో రోజువారీగా సగటు 70 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుండగా..ప్రస్తుతం ఆ సంఖ్య లక్షా పదివేల వరకు పెరిగింది. అయితే ఉదయం బస్సు మొదటి ట్రిప్పు ప్రారంభించినప్పటి నుంచి సాయంత్రం తిరిగి వచ్చే వరకు తిరిగే ప్రతి ట్రిప్పులోనూ ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఒక్కో రూట్‌లో దాదాపు 100-120 వరకు ప్రయాణికులను ఎక్కించుకొని, జనరల్ టికెట్, జీరో టికెట్లు ఇచ్చే క్రమంలో , ప్రతి ఒక్క ఫ్యామిలీకి రెండు రకాల టికెట్లు ఇష్యూ చేస్తూ, ఎవరికి ఏ టికెట్ ఇస్తున్నామో కూడా గమనించలేని పరిస్థితిలో టికెట్లు ఇస్తున్నట్టు వాపోతున్నారు. జీరో టికెట్‌కు జనరల్ టికెట్ ఇస్తూ, డ్యూటీ దిగేసరికి తన డబ్బులను కూడా పోగొట్టుకుంటున్నామని పలువురు కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి మహిళా ప్రయాణికురాలి ఐడి ప్రూఫ్ చెక్ చేస్తూ తర్వాత స్టేజి వచ్చేలోపు టికెట్‌లు ఇవ్వలేకపోతుండటంతో బస్సు ఒక్కోసారి స్టేజీ దాటిపోతుందనే మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఇచ్చిన రన్నింగ్ సమయం సరిపోక.. తినడానికి సైతం సరిగా టైం కేటాయించుకోలేకపోతున్నట్టు పలువురు కండక్టర్‌లు వాపోతున్నారు.

గుర్తింపు కార్డు ఇస్తే మేలు

రాష్ట్రానికి చెందిన మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణిని ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రతి మహిళకు గుర్తింపు కార్డు ఇస్తే మేలని పలువురు పేర్కొంటున్నారు. తద్వారా ఆధార్ కార్డు ఐడి తనిఖీ చేసే బాధ తగ్గుతుందని, సమయం వృథా కాకుండా ఉంటుందని, ఈ గుర్తింపు కార్డు వల్ల బస్సు పస్ మాదిరిగా దానిని చూసి ఓకే చేస్తామని కండక్టర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తమ బాధను అర్థం చేసుకొని ప్రభుత్వం వెంటనే మహిళలకు గుర్తింపు కార్డుల పంపిణీ కోసం ప్రయత్నించాలన్నారు.

సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందేలా సర్వే చేపట్టాలి

- సీపీఐ(ఎం)డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందే విధంగా సర్వే నిర్వహించాలని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. పట్టణంలోని యానం గుట్ట సుందరయ్య కాలనీలో సిపిఎం ఆధ్వర్యంలో జనరల్ బాడీ మీటింగ్ మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కుతాడి ఎల్లయ్య అధ్యక్షతన ముఖ్యఅతిథిగా సిపిఎం డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఆరు సంక్షేమ పథకాలను అందరికీ అందే విధంగా సర్వే నిర్వహిస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. నిష్పక్ష పాతంగా సర్వే నిర్వహించి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని అన్నారు ఇప్పటికే గ్యాస్ సిలిండర్ 500 ఇస్తున్నారని గ్యాస్ ఆఫీసుల వద్ద ప్రజలంతా బారులు తీరు తున్నారని అన్నారు.

ఇండ్లు లేని పేద ప్రజ లకు ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షల రూపాయలు వెంటనే రుణం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ పెన్షన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం ఆర్మూర్ ఏరియా కమిటీ సభ్యులు భూమన్న వెంకట్ నారాయణ, కుల్దీప్ శర్మ, సాయిలు, నదీమ్, సాయిదా బేగం, మస్రద్ బేగం, తిరుపతి బాయి, భగవాన్, కిషన్, కుంతబాయి, యమున, ఫిరోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

జీరో బడ్జెట్ రాజకీయాలు ప్రజాస్వామ్యానికి మేలు

- గ్యారెంటీలు అమలు చేయకుంటే ప్రజలతో ఉద్యమిస్తాం : ఎంపీ అరవింద్



మాట్లాడుతున్న అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రాష్ట్రంలో జీరో బడ్జెట్ రాజకీయాలను ముందుకు తీసుకువెళ్లినప్పుడే ప్రజాస్వామ్యం వెల్లివిరుస్తుందని, ఇది తాను కోరుట్ల నియోజకవర్గంలో పోటీ చేసినప్పుడు రుజువైందని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ నగరంలోని ప్రగతి నగర్‌లో బిజెపి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బిజెపి 3 లక్షల 70 వేల ఓట్లను సాధించిందని అంటే బిజెపికి సుమారు 30 శాతం ఓటింగ్ వచ్చినట్టు తెలిపారు. బోధన్ నుంచి జగిత్యాల వరకు కష్టపడ్డ బిజెపి కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం కార్యకర్త లేదేనని వెల్లడించారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌కు దీటుగా ఓట్ల శాతం వచ్చిందని వెల్లడించారు. కేంద్ర నాయకత్వం సైతం సంతోషం వ్యక్తం చేసిందని తెలిపారు. జిల్లాలోని అర్బన్‌లో ధన్పాల్ సూర్యనా రాయణ, ఆర్మూర్ నియోజక వర్గంలో పైడి రాకేష్ రెడ్డి గెలిచినందుకు ఎమ్మెల్యేల ను అభినందించారు. కోరుట్ల నియోజ కవర్గంలో పార్టీ బల హీనంగా ఉండడంతో.. నిజామాబాద్ నియోజకవర్గాన్ని వదిలి కోరుట్ల నియోజకవర్గానికి వెళ్లాల్సి వచ్చిందన్నారు.

కోరుట్ల నియోజకవర్గంలో ఇతర పార్టీలు కోట్ల రూపాయలు గుమ్మరిస్తే తాను.. జీరో బడ్జెట్‌కు ఎన్నికలకు నాంది పలికానని తెలిపారు. ప్రధాని మోదీ, బిజెపి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉద్దేశంతో డబ్బులను పంచలేదని తెలిపారు. అయినా కూడా కోరుట్ల నియోజకవర్గంలో 60 వేల ఓట్లు వచ్చినట్టు తెలిపారు.

రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిందని వెంటనే నిల బెట్టుకోవాలని, లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలను లేవనెత్తు తామని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు బోర్డు తీసు కురావాలని రైతుల కలను మోడీ సర్కార్ నెరవేర్చనుందన్నారు. నిజామాబాద్ పర్యటనకు రానున్న నిజామాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో నిజామాబాద్ జిల్లా పరిస్థితులను, సమస్యలను వివరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, జిల్లా అధ్య క్షుడు బసవ లక్ష్మీ నరసయ్య, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి న్యాలం రాజు, కార్పొరేటర్లు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కారుమీదకు దూసుకొచ్చిన కంటెయినర్

నుజ్జునుజ్జయిన కారు.. ముగ్గురికి తీవ్ర గాయాలు
ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద ఘటన



కంటెయినర్ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

టోల్‌ప్లాజా వద్ద టోల్ కడుతుండగా.. వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటెయినర్ కారును ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరితో పాటు టోల్‌ప్లాజా సిబ్బంది ఒకిరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కారులో ఉన్న ఇద్దరితో పాటు టోల్‌ప్లాజా సిబ్బంది గాయపడగా.. ముగ్గురిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వివరాలు మెయిన్‌లో..

ఆర్మూర్‌లో సినిమా షూటింగ్ సందడి



ఆర్మూర్ పాఠశాలలో చిత్రీకరిస్తున్న యూనిట్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని మంథని, ఆలూరు నూతన మండల కేంద్రాల్లోనూ గత రెండు రోజులుగా తెలుగు సినిమా షూటింగ్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా కేంద్రానికి చెందిన దర్శకుడు అభిలాష్‌రెడ్డి స్వీయ దర్శకత్వంలో సప్తగిరి, ప్రియాంక శర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తుండగా చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన పలు సన్నివేశాలను పాఠశాలలో చిత్రీకరించారు. సినిమా షూటింగ్ జరుగుతుందన్న విషయం తెలిసి పట్టణవాసులు కథ నాయకుడు సప్తగిరితో సెల్ఫీ తీసుకునేందుకు ఎగబడ్డారు.

నవతెలంగాణ
నిజామాబాద్
బుధవారం | డిసెంబర్ 27, 2023 | www.navatelangana.com

ఉప్లూర్‌లో అన్నదానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో మంగళవారం దత్త పూర్ణిమను పురస్కరించుకొని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయం వద్ద భక్తులకు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్న వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా ఉత్సవ విగ్రహంతో సాయి భక్తులు ఆలయం చుట్టూ ఊరేగింపుతో పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నందగిరి దయానంద్, పోలేపల్లి లచ్చయ్య, బద్దం గంగారెడ్డి, ఎనుగందుల శశిధర్, పసుపుల రాజేందర్, పెంబర్తి నరేష్ కుమార్, పోతు మురళి, పోతు గణేష్, భక్తులు పాల్గొన్నారు.

పార్క్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి

- ఆర్మూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

నవతెలంగాణ-మాక్లూర్


మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్ పార్కును ప్రారంభించడానికి ఏర్పాట్లు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. మంగళవారం మండలంలోని మామిడిపల్లి, చిన్నాపూర్ గ్రామాల శివారులో గల అర్బన్ పార్కును అటవీ శాఖ అధికారులతో కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు విషయాలను ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పార్క్ ప్రారంభానికి వసతులను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అధికారులను కోరారు. ఆయనతో పాటు అటవీశాఖ అధికారులు ఉన్నారు.

పూలే జయంతి ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాల విడుదల చేస్తున్న ఐక్యవేదిక నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారతీయ చత్రపతి పూలే జాగృతి బీసీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం తెలంగాణ యూనివర్సిటీ గ్రంథాలయం ముందు విడుదల చేశారు. విద్య సామాజిక రంగంలో మహిళల విద్యకోసం కృషిచేసిన తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత, ఆవశ్యకత ఎంతైనా ఉందని, విద్యార్థులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమాలు వ్యాసరచన, క్విజ్ ప్రోగ్రాం, చిత్రలేఖనం, వేషాధారణ, పాటల పోటీలు జనవరి 2, 3న జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమం కామర్స్ మేనేజ్మెంట్ సెమినార్ హాల్లో ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం లక్ష్మీనారాయణ 95733 85794, సురేష్ 8465969793, అనిల్ నంద, 8520909 484 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లక్ష్మి నారాయణ, సుజాత, శిరీష, నరేష్, మల్లేష్, సాయి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహతి చిన్నారులకు బుక్స్ వితరణ


బుక్స్ పంపిణీ చేసిన రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-ఆర్మూర్

రోటరీ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో బాల్కొండలోని మహతి ఆశ్రమంలోని విద్యార్థులకు మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా మంగళవారం బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఛైర్మన్, స్పాన్సర్ రోటరీ కార్యదర్శి పట్వారి తులసి వారికి నోట్ బుక్స్, స్టేషనరీ వస్తువులు, ప్యాడ్స్, పెన్నులు వితరణ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ.. వాజ్‌పేయి జీవనశైలి, ఆలోచనలు నేటి తరానికి ఆదర్శమని, ప్రతి ఒక్కరూ వారిని స్ఫూర్తిగా తీసుకొని దేశ భవిష్యత్తుకు దేశ సేవలో ముందుండాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు చౌటి లింబాద్రి, గోనే దామోదర్, రాధా కిషన్, రాస ఆనంద్, ఆశ్రమ నిర్వాహకులు నిర్మల, స్వరూప, నరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం


హైమాస్ట్ లైటును ప్రారంభిస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని ఇత్వార్ పేట్ గ్రామ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం హైమాస్ట్ లైటును గ్రామ సర్పంచ్ సంతకుల సాయమ్మ జువ్వన్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ హైమస్ట్ లైటును జడ్పీ నిధుల నుండి మంజూరైన ఒక లక్ష 25 వేల రూపాయలతో ఏర్పాటు చేశామని తెలిపారు. లైటు ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసరి వెంకటేష్, ఉపసర్పంచ్ పస్తం చిన్న రాజన్న, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎనుగందుల శ్రీనివాస్, వీడీసీ నాయకులు దొనకంటి రాజేశ్వర్, కాల శంకర్, జంగం మోహన్, సయ్యద్, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నిందితున్ని కఠినంగా శిక్షించాలి

- ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్.


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్

నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ప్రసాద్, అతని కుటుంబాన్ని అదే గ్రామానికి చెందిన ప్రశాంత్ అనే నిందితుడు ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేశారని, ఆయనతోపాటు హత్యకు సహకరించిన వారిని వెంటనే ఉరితీయాలని అఖిలభారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మాణిక్ బండార్ చెక్క దగ్గర విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కలకలం రేపిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురిని అతి కిరాతకంగా హత్య చేసిన నిందితులను ప్రజా కోర్టులో ఉరితీయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీసం చిన్నపిల్లలను చూడకుండా అతి దారుణంగా చంపిన సైకో ప్రశాంత్, సహరించిన వారు ఏ రాజకీయ పార్టీ నాయకులైన కఠినంగా శిక్షించాలని ఆయన అన్నారు. ఇకమీదట ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రజలు భయ ప్రాంతాలకు గురికాకుండా చూడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పోతన్న, నాయకులు లక్ష్మణ్, సుమన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకోసం కృషి చేద్దాం

- జిల్లా కార్యదర్శి సుధాకర్
- సిపిఐ 99 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండావిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుధాకర్

సమసమాజ స్థాపనకోసం కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. సిపిఐ 99 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేద్కర్ కాలనీలోని హమాలి యూనియన్ ఆఫీస్ ముందు సిపిఐ జెండాను జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఎగంవేశారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ రాష్ట్ర నాయకులు కంజర్ భూమయ్య మాట్లాడుతూ.. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)98 వసంతాలు పూర్తి చేసుకొని 99వ సంవత్సరంలో అడుగిడుతున్నదని అన్నారు. భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని 1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో ఏర్పాటు చేసుకున్న పార్టీ సిపిఐ అని తెలిపారు. మనిషిని మనిషి దోపిడి చేయని సమసమాజ నిర్మాణంకోసం ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుదూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందని అన్నారు. ప్రజాకార్మిక సమస్యలపై పోరాటాలు, ఉద్యమాలతో ప్రజలకు, కార్మిక వర్గానికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టామని తెలిపారు. ఈ పోరాటాలలో నేలకొరిగిన అమరవీరుల ఆశయ సాధన కోసం మరింత కృషి అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశానికి వై ఓమయ్య అధ్యక్షత వహించారు. సిపిఐ జిల్లా నాయకులు కే రాజన్న, ఏ రాజేశ్వర్, ఏం స్వరూప రాణి, బొంబాయి గంగారం మాట్లాడుతూ ఈనెల 28 నుండి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన గ్రామ బస్తీ సభలలో పార్టీ నాయకులు పాల్గొని అర్హులైన వారందరితో రేషన్ కార్డుల దరఖాస్తుల తోపాటు 6పథకాల కోసం దరఖాస్తులు పెట్టించాలని అన్నారు ఈ సమావేశంలో సిపిఐ నాయకులు రంజిత్, రఘురాం, అంజలి, అనిల్, రమేష్, ఇమ్రాన్ అలీ, రాధా కుమార్, ఫిరోజ్ అలీ, రజాక్, బాల్ లింగం, భాను, అమర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ప్రధాని మోడీ రైతు ప్రజావ్యతిరేక

విధానాలను ఎండగడదాం

- ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-ఆర్మూర్

నరేంద్రమోడీ కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదా మని కార్మిక రైతు ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేనిచో ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని ఐఎఫ్టియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భూమన్న, దాసు హెచ్చరించారు. ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ సమావేశం పట్టణంలోని మామిడిపల్లిలో మంగళవారం భూమన్న అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని అన్నారు.

సంపద సృష్టికర్తలైన కార్మికుల కుటుంబాలకు కన్నీళ్లు మిగిల్చిన మోడీ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల వాగ్దానాలు విస్మరించి, మోడీ జన్‌ధన్ ఖాతా పేరుతో పేద వారికి 15 లక్షల జమ, నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ, ఏటా రెండు కోట్ల కొలువులు, ప్రజాస్వామిక పరిపాలన హామీలు నీళ్ల మూటగా మారాయని వారు తెలిపారు. ప్రభుత్వ రంగాలను అంబానీ, అదానీ లాంటి పెట్టుబడిదారులకు అమ్మేసి, కార్మికుల ఉపాధి భద్రత దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే చర్యలను మోడీ ప్రభుత్వం అనుసరిస్తోందని వారన్నారు. ఉద్యమకారులను ప్రశ్నించే గొంతులను నిర్బంధిస్తున్నారని వారు తెలిపారు. పోరాడి హక్కులను, జీవితాలను కాపాడుకొందామని కార్మిక లోకానికి పిలుపును ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అహంకారపు చర్యలతో, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా అవినీతికి నిలయంగామార్చి, ప్రజల జీవితాలతో చెలగాట మాడిందని వారన్నారు. కనీస వేతనాలు చట్టాన్ని అమలు చేసి, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దాసు కోరారు. ప్రజా సమస్యల్ని చిత్తశుద్ధితో పరిష్కరించి ప్రజల మన్నన పొందాలని వారు సూచించారు. సమావేశంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బి. సూర్య శివాజీ, జెల్లా మురళి, ఎండి.కాజామొయినుద్దీన్, జేపీ గంగాధర్, శివకుమార్, ఎల్బీర వి, దాల్మల్కి పోశెట్టి, భారతి, మోహన్, రాజు, సుధాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇండియా ఇంటర్నేషనల్

సైన్స్ ఫెస్టివల్‌కి ఎన్నికైన జిల్లా ఉపాధ్యాయుడు

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎంపికైన ఉపాధ్యాయుడు

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుబ్బలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు చల్లా ముద్దుకృష్ణ ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ 2023లో పాల్గొనడానికి ఎన్నికయ్యారు. ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్ (ఐఐఎస్ఎఫ్) అనేది విజ్ఞాన భారతితో కలిసి భారత ప్రభుత్వంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్ సైన్సెస్ వారు నిర్వహిస్తారు. ఇది జనవరి 17నుండి 20 2024 హర్యానా, ఫరీదాబాద్‌లోని డిబిటి-పిహెచ్ఐ ఎస్‌టిఐ-ఆర్‌సిబి క్యాంపస్‌లో జరగనున్న ఐఐఎస్ఎఫ్ 2023 9వ ఎడిషన్ అని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎడ్యుకేషన్ ఫర్ ఆస్పైరింగ్ ఇండియా - నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్‌షాప్ ప్రయోగాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి, కీలకమైన అంశాలను నొక్కిచెప్పడానికి సమస్యలను ప్రోత్సహించడానికి దేశవ్యాప్తంగా వినూత్నమైన, అంకితభావంతో కూడిన విద్యావేత్తలను సేకరించడం దీని లక్ష్యం. పాల్గొనేవారు కార్యాచరణ-ఆధారిత అభ్యాసంలో బోధనా పద్ధతులు ఆవిష్కరణలను పంచుకుంటారు. సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్ ద్వారా దేశ నిర్మాణానికి సైన్స్ విద్యను ఒక సాధనంగా ఉపయోగించడం ఈ కార్యక్రమం లక్ష్యం. కార్యక్రమంలో పాల్గొనడానికి ఎన్నిక కావడం పట్ల దుబ్బ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు గంగయ్య ముద్దుకృష్ణ ను అభినందించారు. గతంలో ముద్దుకృష్ణ తయారు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ జాతీయ స్థాయిలో ఉత్తమ మెటీరియల్‌గా గుర్తింపు పొంది సిల్వర్ మెడల్ గెలుచుకున్నారు. తద్వారా జాతీయ టీచర్ సైంటిస్ట్ ఫోరమ్‌లో జీవిత కాలం మెంబర్ గుర్తింపు లభించింది. దక్షిణ భారతదేశ స్థాయిలో జరిగిన టీచర్ ఎగ్జిబిషన్‌లో మొదటి బహుమతి అందుకున్నారు. తన పర్యవేక్షణలో విద్యార్థుల ద్వారా తయారు చేయబడిన ఆరు ఎగ్జిబిట్స్ రాష్ట్ర స్థాయికి ఒకటి సౌత్ ఇండియాకి ఎన్నిక కావడం జరిగింది.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు..

- మగ్గిడి పూర్వ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థిని పుట్టింటి నవీన ఈనెల 27 నుండి 30 వరకు తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా శ్వవిద్యాలయంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌కు ఎంపిక అయింది. నవీన ప్రస్తుతం మల్లారెడ్డి ఇన్స్టిట్యూట్, మేడ్చల్‌లో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతుంది. ఈ సందర్భంగా మంగళవారం వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ మల్లేష్ గౌడ్, ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పవన్, భూపతి, రాజేష్, యాదగిరి, శ్రీనివాస్, సురేష్ నవీనను అభినందించారు.

ఘనంగా భీమన్న ఉత్సవాలు



నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని నల్లూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం భీమన్న ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో భక్తుల మధ్య భీమన్న దేవుణ్ణి ఊరేగించారు. దాదాపు 250 మందికి పైగా భక్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళ భక్తులు భగవంతునికి పూజ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో కుల సంఘాల పెద్దలు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుమారుడి నిశ్చితార్థం

- హాజరైన జిల్లా నాయకులు


నిశ్చితార్థంలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కుమారుడు స్నేహిత్ రెడ్డి నిశ్చితార్థం మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ నిశ్చితార్థంలో నిజామాబాద్ రూరల్ యువజన విభాగం అధ్యక్షుడు, ఇతర మండల నాయకులు హాజరైనట్లు మండల కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు వినోద్ తెలిపారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి

- గ్రామ అభివృద్ధి కమిటీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇసుక వ్యాపారులు అక్రమంగా ఇసుకను తరలిస్తు ఎక్కడ పడితే అక్కడ గుంతలు ఏర్పాటు చేసి నీరు నిల్వ లేకుండా చేస్తున్నారని, దీంతో చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ బోర్ బావుల్లో నీరు లేకుండా చేస్తున్నారని వెంటనే అధికారులు జోక్యం చేసుకుని అరికట్టడానికి చర్యలు చేపట్టాలని తిర్మన్ పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గోపు గోవర్ధన్ అధ్వర్యంలో ఎంపిటిసి చింతల దాస్, సభ్యులతో కలిసి తిర్మన్ పల్లి శివారులోని మొరివాగును సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొరివాగు నుండి రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక వ్యాపారులు అధికారులతో కుమ్మక్కై రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని వివరించారు. అధికారులకు లంచాలు అంటగట్టి ఇష్టానుసారంగా అడ్డు అదుపు లేకుండా ట్రాక్టర్, టిప్పర్ల ద్వారా ఇసుకను రవాణ చేస్తు లక్షలు రూపాయలు సంపాదించు కుంటున్నారని తెలిపారు. పలుమార్లు వారిని హెచ్చరించిన తమకు అధికారుల అండ ఉందని మరింత రెచ్చిపోతున్నారని, ఇదంతా అధికారుల కనుసైగలోనే జరుగుతుందని తెలిపారు. లంచాలు తీసుకుంటూ ఇసుక వ్యాపారులకు మద్దతు పలకం వల్లే, అడ్డు అదుపు లేకుండా వాగునుండి ఇసుక తరలించి రైతులకు తీరని నష్టం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక తరలించకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలో కలెక్టర్, ఉన్నతాధికారులకు కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

టోల్ ప్లాజా వద్ద ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత నిజామాబాద్ రూరల్‌కు వస్తున్న సందర్భంగా రూరల్ నియోజకవర్గంలోని అయిదు మండలాల నుండి కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఇందల్ వాయి టోల్ ప్లాజా వద్ద కు చేరుకుని ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్, డిసిసిబి డైరెక్టర్ కోరట్ పల్లి అనంద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సంతోష్ రెడ్డి, చింతల కిషన్, బోర్‌వెల్ రాజేందర్ రెడ్డి, ఎల్ఐసి గంగాధర్, హబిబ్, ప్రవీణ్ గౌడ్, జమీల్ పాషా, దాశరథ్, శ్యాం సన్, డాక్టర్ శాదుల్లా, దర్మగౌడ్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



నవతెలంగాణ-ముప్కాల్

శివశక్తి యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సర్కిల్ క్రికెట్ టోర్నమెంట్ ముప్కాల్ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మూడు రోజుల పాటు క్రికెట్ పోటీలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కె.గంగాధర్, ఎంపీటీసీ సభ్యులు నాయకుడు పద్మ-కిషన్, వీడీసీ అధ్యక్షులు ఎర్రోళ్ల విజయ్, విశ్రాంత ఉపాధ్యాయులు అంజయ్య, పల్లికొండ గోపీనాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేష్ కుమార్

పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ వారి జిల్లా అంధుల వనరుల కేంద్రంలో సూక్ష్మ, చిన్న మధ్యతరగతి పరిశ్రమల కేంద్ర మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ సంయుక్త ఆధ్వర్యంలో షెడ్యూల్ తెగలు ఎస్టి యువతకు సూక్ష్మ మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఎస్ఎంఈ-డీఎఫ్ఓ హైదరాబాద్ సహాయక సంచాలకులు రాజేష్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఉత్సావ వంతులైన పారిశ్రామికవేత్తలకు శిక్షణను అందించారు. యువత కూలి పని చేయడం ద్వారా తమ కుటుంబాల అవసరాలు తీర్చలేదని వారు ఎప్పుడు బీదవారిగానే మిగిలిపోతున్నారని అన్నారు. చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్నట్లయితే ప్రభుత్వాలు వారికి కావలసిన ఆర్థిక సహాయం ముడి సరుకుల సరఫరా మార్కెట్లకు సహాయం అందిస్తామని అన్నారు. ముఖ్యంగా ఎస్టీ యువతకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా గ్యారెంటీ లేని రుణాలు అందిస్తామన్నారు. ముఖ్యంగా కమ్మరి, వడ్రంగి, ఔసలి, నాయి బ్రాహ్మణి, మేస్త్రీలు, చాకలి, కుమ్మరి, ఇతర వృత్తుల వారికి లక్ష రూపాయలు ఎలాంటి గ్యారెంటీ లేకుండా రుణాలు ఇప్పిస్తామన్నారు. తాను నిజామాబాద్, కామారెడ్డి, అదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఎమ్మెస్ఎంఈ ద్వారా నోడల్ అధికారిగా పనిచేస్తున్నానని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో శ్వాస రెడ్డి, కార్యదర్శి సిద్ధయ్య ప్రిన్సిపాల్ జ్యోతి, స్నేహ ఐటీ ప్రోగ్రామ్ మేనేజర్ మోహిజ్ అహ్మద్, ఎస్టి యువకులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో పలువురి చేరికలు

నవతెలంగాణ-మాక్లూర్


కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరిక

మండలంలోని పలువురు బిజెపి, బిఆర్ఎస్ పార్టీల నుంచి మంత్రి జూపల్లి కృష్ణ రావు సమక్షంలో కాంగ్రెస్‌లో మంగళవారం చేరారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పర్యటన సందర్భంగా నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గడ్డం గంగారెడ్డి(బీజేపీ), గోవూరి ఒడ్డెన్న (ఎంపిటిసి మదనపల్లి బీజేపీ), కాల గడ్డ దేవన్న ఎంపిటిసి డీకంపల్లి-బీఆర్ఎస్), బేగరిసత్యమ్మ రవి (ఎంపిటిసి గొట్టుముక్కుల బీజేపీ), కేతావత్ రామచందర్ ఎస్టీ సెల్ నాయకులు (బీజేపీ), ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంత్రి జూపల్లి కృష్ణారావు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ మోహన్ రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు ఏనగంటి గంగాధర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు డేగ పోశెట్టి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి ప్రకాష్, మాజీ సొసైటీ చైర్మన్ దయాకర్ రావు, మాజీ సొసైటీ వైస్ చైర్మన్ లచ్చ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్, నాయకులు విట్టల్, భరత్, నవీన్, ఆరిఫ్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న పండగ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని మైలారం గ్రామంలో మల్లన్న దేవాలయం వద్ద మంగళవారం రోజున అగ్గు కలకారులతో అగ్ని గుండం, మల్లన్న నాగవెల్లి, పట్నాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అక్కడ జరిగే పండగను తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.



బీజేపీ నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామంలో ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదంలో గాయాలైన గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ యువజన నాయకులు సిద్ధును కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట బిజెపి గ్రామ యువజన నాయకులు ఆనంద్, హరి, సాయిప్రసాద్, తరుణ్, సంతోష్, అరుణ్, రాకేష్, నవీన్ రెడ్డి, ఆదర్శ్, పవన్, తదితరులు ఉన్నారు.



బీజేపీ నాయకున్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కాంగ్రెస్ నుంచి రాజంపేట్ మండల నాయకుల బహిష్కరణ

- జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు

నవతెలంగాణ-కామారెడ్డి

రాజంపేట్ మండలానికి చెందిన ఇద్దరు నాయకులను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాసరావు తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకుగానూ కాంగ్రెస్ పార్టీ నుంచి రాజంపేట్ మండలానికి చెందిన బాలకిషన్, గంగాధర్‌గౌడ్‌ను సస్పెండ్ చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఇకముందు ఎవరైనా పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులకు సూచించారు.



మరమ్మతులకు నోచుకోని ట్రాన్స్‌ఫార్మర్..

- ఆగిన లిఫ్ట్ సాగునీరు
- రైతులకు ఇబ్బందులు
- నిండని చెరువులు
- నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-బోధన్

సాలురా మండలంలోని మంజీరా ఒడ్డున గల ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ గత కొన్ని నెలల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి దాని కాయల్స్‌ను దొంగిలించారు. దాంతో ట్రాన్స్‌ఫార్మర్ నెలల తరబడి మరమ్మతులకు నోచుకోక పెండింగ్లో ఉండిపోయింది. మధ్యలో శాసనసభ ఎన్నికలు రావడంతో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు అలాగే ఉండిపోయింది. ప్రస్తుతం యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధమయ్యారు. ఈ పంటలకు తప్పనిసరిగా సాగునీరు అవసరం కావడంతో రైతులు ఎత్తిపోతల ద్వారా అందే సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ట్రాన్స్‌ఫర్ మరమ్మతులకు లక్షల రూపాయల నిధులు అవసరం కావడంతో ఇబ్బందిగా మారింది. అలాగే లిఫ్ట్ నిర్వహణ కోసం రైతులు చెల్లించే కిస్తూ డబ్బులు చాలా వరకు బకాయి ఉండడంతో నిధుల కొరత ఏర్పడినట్లు పలువురు తెలిపారు.

లిఫ్ట్ పరిధిలో సుమారు 1600 ఎకరాల వరకు రైతులు వ్యవసాయ భూములు సాగుచేస్తారు. ప్రస్తుతం రైతులు వరి నాట్లు వేయడానికి సిద్ధం కావడంతో సమయానికి సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం లిఫ్ట్ ద్వారా విడుదలయ్యే నీటిని చెరువులకు మళ్లించి అక్కడి నుంచి రైతులు పంటలకు విడుదల చేస్తారు. ఈసారి చెరువులలో సరిపడా నీరు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మరమ్మతులకు నిధులు మంజూరి..

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు కావలసిన నిధుల కోసం లిఫ్ట్ కమిటీ ప్రతినిధులు, పలువురు రైతులు ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని కలిసి సమస్య విన్నవించగా ఆయన రూ.5,20,608 నిధులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేశారు. ఇప్పటికే నాట్లు వేయడంలో రైతులు నారుతో సిద్ధంగా ఉన్నారు. బోరు బావుల కింద నీటి సౌకర్యం ఉన్న రైతులు వరి నాట్లు పూర్తి చేస్తున్నారు. మిగిలిన చిన్న సన్నకారు రైతులు లిఫ్టు ద్వారా విడుదల చేసే సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. నిజాంసాగర్ నీరు విడుదల చేసినా అది ఆశించినంత మేరకు పంట పొలాలకు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. కావున లిఫ్ట్ కమిటీ ప్రతినిధులు త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు చేయించి సాగునీరు అందించేలా కృషి చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



వారం రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు పూర్తి..



ట్రాన్స్‌ఫార్మర్ కాయల్స్ దొంగతనం జరగడంతో ఇబ్బంది అయింది. దాంతో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సార్‌కు సమస్య వివరించాం. దాంతో ఆయన ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ కోసం నిధులు మంజూరి చేశారు. దాంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను రిపేర్‌కు తరలించాం. వారం రోజులలో ట్రాన్స్ ఫార్మర్ రిపేర్ చేయించి లిఫ్టు మోటర్లు పరిశీలించి లిఫ్టు స్టార్ట్ చేసే ప్రయత్నాలు చేస్తాం. ఎలాగైనా యాసంగి పంటలకు సాగునీరు అందిస్తాం. రైతులు అంత వరకు వేచి ఉండాలి. రైతుల ఇబ్బందులు తెలుసుకుని ట్రాన్స్‌ఫార్మర్ రిపేరుకు నిధులు మంజూరి చేసి ఆదుకున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

- బియన్ సురేష్, లిఫ్ట్ కమిటీ ప్రతినిధి.

అన్నదాతకు సన్మానం



అన్నదాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని కల్కినగర్‌లో గల శ్రీ పరం జ్యోతి కల్కి భగవాన్ ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని శ్రీ రాధా కృష్ణ రైస్ మిల్ కామారెడ్డి సహకారంతో నిర్వహించారు. అన్నదానానికి సహకరిస్తున్న వారికి సన్మాన కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. శ్రీ రాధాకృష్ణ లాడ్జ్ యజమానికి ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సేవకులు ఎర్రం చంద్రశేఖర్, విజయ్, డాక్టర్ బాలు, పార్శి శ్రీనివాస్, దిగంబర్, గంజి శ్రీనివాస్, చంద్రకళ, పబ్బజ్యోతి, పప్పుల శ్రావణి, పబ్బ లహరి, అనుసూజ, గంజి శ్రీదేవి పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి వెండి నాగ పడిగు బహుకరణ



వెండి నాగ పడిగె బహుకరణ

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి వెండి పంచ తల నాగపడిగెను మంగళవారం బహుకరించారు. ఈ సందర్భంగా తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ మాట్లాడుతూ.. దోమకొండ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగభూషణం గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు రాజ నర్సాగౌడ్, సుదర్శన్‌గౌడ్, సిద్దాగౌడ్ ప్రసాద్‌గౌడ్, కర్రోల రామాగౌడ్, రవిగౌడ్, శ్యాంసుందర్‌గౌడ్, వెంకట్‌గౌడ్, యాదగిరిగౌడ్, నర్సాగౌడ్, హరికిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భిక్కనూరులో భారత్ గ్యాస్ కేవైసీ



కేవైసీ చేస్తున్న గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణంలోని నగరేశ్వర ఆలయంలో భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు కేవైసీ అప్‌డేట్ చేపట్టారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు నాగేశ్వర్ మాట్లాడుతూ భారత్ గ్యాస్ వినియోగదారులు గ్యాస్ కనెక్షన్ కేవైసీ అప్‌డేట్ కొరకు కనెక్షన్ ఎవరి పేరుపై ఉంటుందో వారు ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని నగరేశ్వర ఆలయం వద్ద కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, ఈ గ్యాస్ కేవైసీ అప్‌డేట్ శనివారం వరకు కొనసాగుతుందని, మండల ప్రజలు కేవైసీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వీరునికి మరణం లేదు

- రజాకార్లను, భూస్వాములను ఎదిరించిన మహావీరుడు కోవెల కిషన్
- ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్

నవతెలంగాణ-లింగంపేట్

భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం దొరలను, భూస్వాములను ఎదిరించిన కోవెల కిషన్‌కు మరణం లేదని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు బట్టు విట్టల్ అన్నారు. మంగళవారం పేద ప్రజల ఎడ్ల బండ్ల యాత్రలో ఆయన పాల్గొన్నారు. ముందుగా కిషన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల పక్షపాతిగా, వారి బతుకులో పోరాడే స్ఫూర్తి నింపిన అమరయోధుడు కేవల్ కిషన్ ముదిరాజ్ అని పేర్కొన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయనో అగ్నికణం, రజాకర్లకు ఎదురొడ్డి పోరాడిన వీరుడని తెలిపారు. జాగీరుదారుల, పెత్తందారుల కోరలు పీకిన సింహస్వప్నమని, వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. భూస్వాములను గడగడలాడించి పేదప్రజలకు భూములు పంచి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజా నాయకుడని తెలిపారు. ఆయన పోరాట పటిమ, మెరుపు దాడి, ప్రజల చైతన్య స్ఫూర్తి మింగుడు పడని కొందరు దొరలు భూస్వాములు, పెత్తందార్లు రోడ్డు ప్రమాదం ముసుగులో కెవాల్ కిషన్‌ను హతమార్చారని అన్నారు. కేవల్ కిషన్ ముదిరాజ్ హత్యకు గురైన ఆ గ్రామంలో కేవల్ కిషన్ ముదిరాజ్ విగ్రహం ఏర్పాటు చేసి ప్రతీ యేటా ప్రజలు, ఆయన స్ఫూర్తిని స్మరిస్తూ కొన్నేండ్లుగా ఉత్సవాలను, జాతరగా, ఎడ్లబండ్ల ఊరేగింపుతో ఘనంగా నిర్వహిస్తూనే ఉన్నారని తెలిపారు.

హామీలు అమలు చేసేవరకూ పోరాటం

- కామారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎల్.దశరథ్
- సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కామారెడ్డి: నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ పోరాటం చేస్తామని కామారెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ తెలిపారు. మంగళవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం వద్ద ఆ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ జెండావిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1925 డిసెంబర్ 26న కాన్పూర్ నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిందని, భారత దేశ స్వతంత్ర ఉద్యమంలో పాల్గొందన్నారు. తెలంగాణ ఉద్యమంలో భారత దేశ స్వతంత్ర ఉద్యమంలో సీపీఐ పాల్గొన్నదని తెలిపారు. సీపీఐ 98 సంవత్సరాలు ముగించుకొని 99 సంవత్సరంలో అడుగుపెట్టిందన్నారు. రైతు ఉద్యమంలో బడుగు, బలహీన వర్గాల ఉద్యమంలో నిత్యం పేద ప్రజల కోసం పనిచేసే భారత కమ్యూనిస్టు పార్టీ నాడు పదిలక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిందని వివరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.బాలరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.నర్సింలు, జి.మల్లేష్, జి.ఈశ్వర్, పుష్పలత, దేవయ్య, రాజశేఖర్, శ్యామల, పోషవ్వ, హనుమాన్లు, సాయిలు, ఎల్లయ్య, శివప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో సిపిఐ జెండావిష్కరణ..

కోటగిరి: మండల కేంద్రంలో సిపిఐ జెండాను సిపిఐ మండల కార్యదర్శి ఎ.విట్టల్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం, తాడిత, పీడిత ప్రజల అభివృద్ధి కోసం 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 98 వసంతాలు పూర్తిచేసుకుని 99వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిపిఐ నాటి నుంచి నేటివరకు ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుదూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పిందని అన్నారు. పోరాటాలు, ఉద్యమాలతో ప్రజలకు, కార్మికవర్గానికి అనేక హక్కులు, సౌకర్యాలు సాధించి పెట్టామని ప్రజాసేవ కోసం ఎందరో అమరవీరులు నేలకొరిగారని, మరెందరో ప్రజలకోసం తమ జీవితాలను త్యాగం చేశారని అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా ప్రతి ఒక్క కార్యకర్త పనిచేయాలని ఎ.విట్టల్‌గౌడ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు నల్లగంగాధర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



కామారెడ్డి: జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు



కోటగిరిలో...

ఘనంగా దత్తాత్రేయ జయంతి వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్: సాలూర మండల కేంద్రంలో గోసంగి సేవా సంఘం ఆధ్వర్యంలో దత్తత్రేయ స్వామి జయంతి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తత్రేయ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. సృష్టిలో అందరూ సమానమేనని, సర్వమత సామరస్యాన్ని చాటి చెప్పినది దత్తాత్రేయుడని తెలిపారు. గోసంగిలు ఆయన మార్గాన్ని అనుసరించడం అభినందనీయమని అన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన పెద్దలను గోసంగి సేవా సంఘం ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు బుద్దె రాజేశ్వర్, సురేష్ పటేల్, అల్లె రమేష్, పిఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఇల్తెపు శంకర్, మాజీ జెడ్పిటిసి శారద, సింగడి నగేష్, గోసంగి సేవా సంఘం నాయకులు రాజేంద్రగిరి, అభిషేక్ గిరి, సంఘ యువకులు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామ శివారులో గల సిద్దుల గుట్ట ఆలయంలో దత్త జయంతిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు కోట సిద్దులు ఆధ్వర్యంలో ఆలయంలో ఉదయం వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోత్సవ పారాయణం నిర్వహించి దత్తునికి నామకరణం చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బెజుగం చంద్రశేఖర్, బుడుగుల సంతోష్, ఉప్పు శ్రీను, కోట రాజులు, పుండరీకం సేట్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: మండలంలోని మేనూర్ గ్రామ శివారు పరిధిలో దత్త ఆలయం వద్ద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. దత్త జయంతి వేడుకల్లో భాగంగా మేనూర్ గ్రామానికి చెందిన వై.గోవింద్ కుటుంబ సేవలు మరువలేనివని మేనూర్ గ్రామ ప్రజలు ఆ కుటుంబం గురించి ప్రత్యేకంగా కొనియాడారు.

రామారెడ్డి: మండలంలోని మోషన్‌పూర్‌లో అతి పురాతనమైన దత్తాత్రి స్వామి ఆలయంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోషన్‌పూర్‌తో పాటు వివిధ గ్రామాల ప్రజలు, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల కిషన్ గౌడ్, ఎంపీటీసీ దత్తాద్రి ఉమాదేవి, ఆలయ పూజారులు ఉమా కాంతారావు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దత్త పౌర్ణమి పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రావి చెట్టుకు మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మద్నూర్‌లో..



పిట్లం: పారాయణం వినిపిస్తున్న పండితుడు



రెంజల్‌లో...



రామారెడ్డిలో...



బోధన్‌లో...

ఎంపిపిపై అవిశ్వాసం

- జిల్లా అదనపు కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానం పత్రం అందజేత

నవతెలంగాణ-మాక్లూర్



మాక్లూర్ ఎంపీపీ మస్త ప్రభాకర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చిత్ర మిశ్రాకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ చిత్రా మిశ్రా కు అవిశ్వాస తీర్మానాని మాక్లూర్ మండల ఎంపీటీసీలతో కలిసి అందజేశారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

నవతెలంగాణ-భీంగల్



మండలంలోని చేంగల్ గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జెసిబిని పట్టుకున్నట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. చెంగల్ గ్రామంలో మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు అధిక లోడుతో వెళుతుండడంతో వాటిని ఆపి పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకపోవడంతో నాలుగు ట్రాక్టర్లను, జెసిబిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. వాటిని ఎడి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు

కొనసాగుతున్న అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు



అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్టాపనలో స్వాములు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలలో భాగంగా రెండవ రోజు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామ శరన్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్టాపన ఉత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం గణపతి పూజ, మండపారాధన పూజలు, చండీ హెూమం, యంత్ర జపాలు, పూర్ణహుతి కార్యక్రమాలను నిర్వహించారు. సాయంకాలం బాల రాజేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్టించే విగ్రహాలకు, కలశాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహాలను, కలశాలను బాల రాజేశ్వరస్వామి ఆలయం నుంచి అయ్యప్ప ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అయ్యప్ప ఆలయం వద్ద దేవత మూర్తులకు అభిషేకం, దాన్యాధివాసము, అష్టదిగ్బంధనం, నవవిధ హారతులు, తీర్థప్రసాద వితరణ, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

మహిళకు రక్తం అందజేత



రక్తదానం చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో రేఖ అనే మహిళ రక్తహీనతతో బాధపడుతుండడంతో వారికి కావలసిన ఏబి పాజిటివ్ రక్తం రక్తనిధి కేంద్రాలలో లభించకపోవడంతో ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్‌క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలుకు తెలియజేయడంతో వెంటనే స్పందించి కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో ఏబి పాజిటివ్ రక్తాన్ని అందజేశారు. రక్తదానానికి ముందుకు వచ్చిన శ్రీకాంత్ రెడ్డికి ఐవీఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా తరపున అభినందనలు తెలియజేశారు. రక్తదానం పట్ల అపోహలు వీడనాడాలని రక్తదానం చేయడానికి ముందుకురావాలని అన్నారు. ఈ కేంద్రంలో కేబిఎస్ రక్తనిధి కేంద్రం టెక్నీషియన్లు జీవన్, సంపత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకు సహకరించాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల సరిహద్దు పంటపొలాల్లో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దుకు సహకరించాలని ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి మంగళవారం మండల కేంద్రంలోని నాయకులు, వీడీసీ సభ్యులు, ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి తరుపున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడంతో వాయు, జల కాలుష్యాలు ఏర్పడుతాయని అన్నారు. వన్య ప్రాణుల జీవనానికి ముప్పు వాటిల్లుతుందని తెలిపారు. గోదావరి జలాలు కలుషితమై తాగునీటి అపరిశుభ్రత, గోదావరి నదిలో చేపలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నారు. పరిసర గ్రామ ప్రజలతో ఎలాంటి అభిప్రాయ సేకరణ చేయకుండా ఫ్యాక్టరీ ప్రారంభించడం సరికాదని అన్నారు. రోజురోజుకు ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు శరవేగంగా జరుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఫ్యాక్టరీ పనులు తాత్కాలికంగా నిలిపివేయాలని జిల్లా కలెక్టర్‌కు చరవాణి ద్వారా ఆదేశించారు. మండలంలోని రైతులు, నాయకులు ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయాలని అన్నారు. ఫ్యాక్టరీ తరలించేందుకు నావంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఎలాంటి ఆందోళనా కార్యక్రమాలు చేపట్టినా మీతో కలిసి పోరాటం చేయడానికి సిద్ధమని తెలిపారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-లోకేశ్వరం

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన లోకేశ్వరం మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుస్పూర్ గ్రామానికి చెందిన రామిల్లి సాయిలు(45) సంతానం లేకపోవడంతో మనస్తాపంతో గత కొన్ని నెలల నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తన ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని భార్య రామిల్లి అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై సాయికుమార్ తెలిపారు.

సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-జైపూర్

ప్రజలు సాంఘీక దురాచారాలతో పాటు సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలని భీమారం ఎస్సై రాజవర్ధన్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ రేమో రాజేశ్వరి ఆదేశాల మేరకు భీమారం మండల కేంద్రంలో మంగళవారం కళాజాత బృందంచే ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత విద్య, ఆత్మహత్య, సాంఘీక దురాచారాలు, గంజాయి, వాహన ప్రమాదాలు, సైబర్ క్రైమ్‌ల పట్ల కళాజాత బృందం ఆటపాటలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి, కానిస్టేబుల్ మాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులు నీటిని వృథా చేయొద్దు

- ప్రతి నీటిచుక్కా వినియోగించుకోవాలి
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-ధర్పల్లి/డిచ్‌పల్లి

రైతులు నీటిని వృథా చేయవద్దని, ప్రతి నీటిచుక్కాను వినియోగించుకోవాలని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. వరి పంటల సాగుకు ఇబ్బందులు కలుగకుండా మంగళవారం ఆయకట్టు రైతుల కోరిక మేరకు మండలంలోని రామడుగు ప్రాజెక్టు ద్వారా కుడి, ఎడమ కాలువల ద్వారా సాగుకు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు ప్రస్తుత నీటి మట్టం ఎంత ఉందో తెలుసుకున్నారు. రైతులకు అవసరమున్నన్ని రోజులు నీటిని అందించాలని ఆదేశించారు. అలాగే రైతులు నీటిని వృథా చేయకుండా ప్రతి నీటి చుక్కను ఉపయోగించుకొని పంటల దిగుబడిని పెంపొందించుకోవాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వచ్చిందని, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు భరోసానిస్తుందని తెలిపారు. త్వరలో అన్ని వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలను అందించనున్నదని, దానిపై రాష్ట్ర ప్రభుత్వం చాలా వేగంగా సమాలోచనలు చేస్తుందని అన్నారు. బీఆర్ఎస్ గత 9 సంవత్సరాల్లో ప్రజాధనాన్ని దోచుకున్నదే కాకుండా, లక్షల కోట్ల అప్పులను ప్రజలపై భారం మోపేందుకు కుట్ర పన్నిందని బీఆర్ఎస్‌పై ధ్వజమెత్తారు. లక్షల కోట్లు ప్రజల సొమ్ము కేసీఆర్ మెక్కింది కక్కిస్తామని ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం బారాబర్ కాంగ్రెస్ పార్టీ కక్కించే పనిలో ఉందని అన్నారు. ప్రజలకు అన్ని వర్గాల వారికి పార్టీ ఇచ్చిన హామీలు తప్పకుండా అమలు పరిచేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రైతులకు నీటిని విడుదల చేయడం ఆనందంగా ఉందని, ఈ నీటి ద్వారా రామడుగు, కేసరం, చల్లగర్గ, మైలారం, సుద్దులం, కొరట్‌పల్లి, కోరట్‌పల్లి తండా, కలిగోట్, చింతలూర్ మీదుగా బడాభీంగల్ రాతంగాని మేలుజరిగే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరడి పుష్ప-సుబందర్, మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాలరాజ్, జిల్లా నాయకులు ముప్పా గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, మనోహర్ రెడ్డి, మహేందర్, చెలిమేల నర్సయ్య, జేసిబి శ్రీనివాస్, గంగన్న, కోతి నర్సారెడ్డి, మహిపాల్ రెడ్డి, విడిసి సభ్యులు పి.రాజారెడ్డి, కె.రాజారెడ్డి, ఆనంద్, బుచ్చరెడ్డి, భూమయ్య ఆయకట్టు కింది గ్రామాల రైతులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

శబరిమాత దేవిని దర్శించుకున్న రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి.

డిచ్‌పల్లి : మండలంలోని సుద్దులం, కోరట్‌పల్లి గ్రామాల్లో శబరిమాత దేవిని, మల్లయ్య జాతరలో భాగంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని సమస్యలను కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎల్లప్పుడూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏ సమస్య ఉన్నా నేరుగా కలవాలని సూచించారు. అంతకుముందు డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికి శాలువా పూలమాలతో సన్మానించారు. కోరట్‌పల్లిలో గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, మోత్కురి నవీన్‌గౌడ్, డాక్టర్ జాహుర్, పోలసాని శ్రీనివాస్, సీనియర్ నాయకులు, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అనిల్‌రెడ్డి, లక్ష్మణ్ రెడ్డి, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమ్మిస్తూ.. నటిస్తూ.. మోసాలు

- ఆందోళనలో స్థానికులు

నవతెలంగాణ-ఆర్మూర్



గల్ఫ్ దేశాలకు పంపిస్తామని ఒకరు.. లక్కీ డ్రాలో విలువైన బహుమతులు వచ్చునని మరొకరు.... చిట్టీల వ్యాపారంతో మరికొందరు... ఇలా నమ్మిస్తూ.. నటిస్తూ.. జిల్లాలోని ఆర్మూర్ నియోజకవర్గంలో మోసాలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఏడు కోట్ల రూపాయలతో గత జూన్ నెలలో వస్త్ర వ్యాపారం చేసే రాజస్థాన్ వ్యాపారి వడ్డీ వ్యాపారుల నుంచి ఫైనాన్స్‌ల వారి నుంచి అప్పులు తీసుకుంటూ తిరిగి చెల్లిస్తూ నమ్మకంతో ఉంటూ పరారైన ఘటన మరువక ముందే పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తి రెండు కోట్లతో ఉ డాయించడం తీవ్ర సంచలనం రేపింది. విద్యాబుద్ధులు నేర్పుతూ ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులు ఉండగా ఆ వృత్తికే మాయని మచ్చలా ప్రిన్సిపాల్ నిర్వాకం గురించి చర్చించుకుంటున్నారు. ప్రైవేటు పాఠశాలలో విధులు నిర్వహించిన అనుభవం ఉండడంతో పెర్కిట్‌కు చెందిన ప్రముఖ పేరున్న పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద నుంచి 50 లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. వీరితో పాటు కొందరికి గల్ఫు దేశాలకు పంపిస్తామని మరికొందరికి ఉద్యోగాల ఆశచూపి డబ్బులు చెల్లించే పరిస్థితి లేక పరారయ్యాడు. కొన్ని సంవత్సరాల క్రితం గొలుసు కట్టు వ్యాపారంతో పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల బాధితులు అనేకమంది మోసపోయారు. గ్రీన్ గోల్డ్ బయోటెక్ పేరుతో ప్రారంభమైన ఈ కంపెనీలో డబ్బులు పెట్టుబడి పెట్టి లబోదిబోమంటూ బాధితులు ఆందోళన చెందడం అప్పట్లో తీవ్ర కలవరం రేపింది. గత సంవత్సరం బంపర్ ప్రైజ్‌ల పేరిట లక్కీ డ్రా స్కీం నిర్వాహకులు కోట్ల రూపాయలు వసూలు చేసి పరారు కావడంతో బాధిత వ్యక్తులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు వచ్చి ఆందోళన వెలిబుచ్చారు. ఏకంగా విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానంటూ ఆ వృత్తికి మాయని మచ్చలా చేసిన ప్రిన్సిపాల్ నిర్వాకం గురించి స్థానికులు తీవ్రంగా చర్చించుకుంటున్నారు.

ఎవరిని నమ్మి డబ్బులు ఇవ్వవద్దు

మాయ మాటలు చెప్పే ఎవరిని నమ్మవద్దు. పోలీసులకు సమాచారం ఇస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- సురేష్‌బాబు, స్టేషన్‌హౌస్ ఆఫీసర్, ఆర్మూర్

చేపూర్ సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆర్మూర్



ఆలయం వద్ద పలువురు భక్తులు

మండలంలోని చేపూర్ సాయిబాబా ఆలయంలో దత్త సాయి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో కొలువై ఉన్న దత్త సాయి విగ్రహానికి కిరణ్‌కుమార్ జోషి, కిరీటి జోషి పూజారులు పంచామృతాలతో అభిషేకాలు చేసి, వేద మంత్రోచ్ఛరణల మధ్య పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో జాతర అన్నదాన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దాతలు అన్నదానానికి బియ్యం వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా చేపూర్ సర్పంచ్ ఇందూరు సాయన్న,ఎంపీటీసి బాల నర్సయ్య,ఆలయ కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, గౌరవ అధ్యక్షులు కోశాధికారి సురేష్ రుక్మాజీ మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం జరిగే దత్తసాయి జయంతి వేడుకలను గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, వెనుకవంతు సభ్యుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో జరిగే ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దత్త సాయి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.అశోక్, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, సలహాదారులు కత్తి శ్రీను, బి.సాయన్న, ఎం.గిరీష్, దేవిదాస్, స్వామిదాస్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, చేపూర్ గ్రామ ప్రజలు, చుట్టు ప్రక్కల గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండలంలోని కోనాసముందర్‌లో మంగళవారం శ్రీదేవి భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం గ్రామంలో స్వామివారి రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షులు బద్దం గంగారెడ్డి, ఉపాధ్యక్షులు రుపాల ధర్మాజీ, కార్యదర్శి మేకల శేఖర్, బాలయ్య, క్యాషియర్ కరిపే శేఖర్, గ్రామ కమిటీ సభ్యులు జిన విక్రమ్, పోతుగంట శ్రీధర్, బట్టల మురళి, సొసైటీ చైర్మన్ బాపు రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఎల్ఎం కింద 50 పైసల వడ్డీకి రుణాలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



కేంద్ర పథకాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మహిళా సంఘాలకు ఎన్ఆర్ఎల్ఎం కింద ఆహార శుద్ధి చిన్న వ్యాపారానికి 50 పైసల వడ్డీకి ఒక్కొక్క మెంబర్‌కు 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్ బాజన్న మంగళవారం తెలిపారు. మండలంలోని గన్యా తండాలో వికసిత భారత్ సంకల్పయాత్ర వాహనానికి విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు చప్పట్లతో స్వాగతం పలికారు. వికసిత భారత్ సంకల్ప యాత్ర ఇన్చార్జి ఎంపీడీవో బ్రహ్మానందం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలను మండల స్థాయి అధికారులు వారి వారి శాఖ ద్వారా అందజేస్తున్న పథకాలను వివరించారు. కమ్యూనిటీ కోఆర్డినేటర్ భాజన్న మాట్లాడుతూ.. మహిళా సంఘాలకు దీన్‌దయాల్ అంత్యోదయ యోజన నేషనల్ రూరల్ లైలీవుడ్ మిషిన్ కింద మహిళా సంఘాలకు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణాలు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఎన్ఆర్ఎల్ఎం కింద మహిళా సంఘంలోని సభ్యురాలు ఆహార శుద్ధి చేసి ప్లాస్టిక్ కవర్లో ప్యాక్ చేసి అమ్ముకోవడానికి చిన్న వ్యాపారులకు బటానీలు, పల్లి పలుకులు, మురుకులు, అప్పడాలు, పాపడాలు అమ్ముకోవడానికి మండల సమైక్య ద్వారా 40వేల రూపాయలు 50 పైసల వడ్డీకి రుణం అందజేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి సంఘ సభ్యురాలు బ్యాంకు ద్వారా అందిస్తున్న ప్రధానమంత్రి యోజన ఇన్సూరెన్స్‌ను వినియోగించుకొని కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నూర్ సింగ్, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ రాంబాబు, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, వైద్య సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లికి స్వాగతం పలికిన నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకు ఇన్‌చార్జిగా నియమించిన తర్వాత మొదటిసారి నిజామాబాద్‌కు వచ్చిన తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు జిల్లా కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. ఆర్ అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంగళవారం స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మొహమ్మద్ అలీ షబ్బీర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి,బాల్కొండ ఇంఛార్జి సునీల్ రెడ్డి, బాన్సువాడ ఇంఛార్జి రవీందర్ రెడ్డి,జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు వేణు రాజ్,జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు,జిల్లా కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు.



మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం



నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని పూజారి ప్రవీణ్ పంతులు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి- గోవిందామాంబాల కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా ముందుగా ఎదుర్కోలు నిర్వహించి కళ్యాణ ఘట్టాన్ని పూర్తి చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారంరాత్రి భజన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ కళ్యాణాన్ని తిలకించేందుకు మండలంలో వివిధ గ్రామాల భక్తులు హాజరయ్యారు. భక్తులకు విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమన్ని నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు, మండలంలోని భక్తులు, పలువురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-నార్నూర్

తమ గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలని గాదిగూడ మండలంలోని కునికాసా గ్రామస్తులు మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మీకి వినతి పత్రాన్ని అందజేశారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కునికాసా గ్రామస్తులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.